Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 341 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 23 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

# భారత్ దాడులతో పాక్‌కు భారీ నష్టం




**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కారణంగా.. పాకిస్థాన్ తీవ్ర నష్టాలను చవి చూస్తోందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పాక్ వైమానిక దళానికి చెందిన నాలుగు ఎఫ్ 16 సూపర్ సోనిక్ ఫైటర్ జెట్లను భారత క్షిపణి వ్యవస్థ కూల్చి వేసింది. అలాగే పాకిస్థాన్ వైమానిక దళంలో అత్యంత కీలకమైన సర్గోదా వైమానిక స్థావరం సైతం తీవ్రంగా దెబ్బతిన్నది. ఇందులోని రాడార్ వ్యవస్థ దాదాపుగా ధ్వంసమైంది. దీంతో వీటిని మరమ్మతులు చేయించాలంటే.. దాదాపు 100 మిలియన్ డాలర్లు అవసరమవుతాయని ఆయా నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే ఎఫ్ 16 వల్ల 349.52 మిలియన్ డాలర్లు, సీ 130 తో 40 మిలియన్ డాలర్లు, హెచ్‌క్యూ కారణంగా 200 మిలియన్ డాలర్లతోపాటు రెండు మొబైల్ కమాండ్ సెంటర్లు 10 మిలియన్ డాలర్లు మేర నష్టపోయాయని సోదాహరణగా ఆయా నివేదికలు వివరించాయి. భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో నిషేధిత జైషే మొహమ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద ప్రధాన కార్యాలయాలకు చెందిన తొమ్మిది రహస్య స్థావరాలను నెలమట్టం చేసింది. ఈ దాడుల్లో దాదాపు 100 మందికిపైగా ఉగ్రవాదులు మరణించిన సంగతి తెలిసిందే. సరిగ్గా గత నెల ఇదే రోజు.. అంటే ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలోని పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 26 మంది మరణించారు. ఈ ఘటనకు పాకిస్థాన్ కారణమని భారత్ ఆధారాలను సేకరించింది. ఈ నేపథ్యంలో పాక్‌కు వ్యతిరేకంగా భారత్ చర్యలు చేపట్టింది. అందులోభాగంగా సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది. అలాగే పాకిస్థాన్ సైతం భారత్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంది. ఆ క్రమంలో సిమ్లా ఒప్పందాన్ని పాక్ రద్దు చేసింది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాంటి వేళ భారత్.. ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. అందుకు ప్రతిగా పాకిస్థాన్ భారత్ సరిహద్దుల్లోని భూభాగంపైకి డ్రోనులు, క్షిపణులతో దాడి చేసింది. ఈ దాడిలో 27 మంది భారతీయులు మరణించగా.. 70 మంది గాయపడ్డారు. అనంతరం పాకిస్థాన్ దిగి వచ్చింది. దీంతో ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. కానీ ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మాత్రం ఇంకా కొనసాగుతోన్న విషయం విదితమే.

# తల్లికి వందనం పథకంపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కీలక ప్రకటన




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఏపీ సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వడివడిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. విద్యను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పథకం రూపొందించారు. విద్యార్థుల సంక్షేమం కోసం తల్లికి వందనం పథకం ప్రవేశపెట్టారు. ఈ పథకం రాష్ట్రంలో విద్యా వ్యవస్థలను బలోపేతం చేయడానికి ఎంతో కృషి చేస్తుంది. ఈ క్రమంలో 'తల్లికి వందనం' పథకంపై మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి కీలక ప్రకటన చేశారు. పాఠశాలలు మొదలుపెట్టే రోజున 'తల్లికి వందనం' పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందిస్తామని ప్రకటించారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి చూపిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ఉద్ఘాటించారు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి. ఆత్మకూరులో ఇవాళ(గురువారం) మినీ మహానాడు నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎనిమిది తీర్మానాలను మంత్రి ఆనం ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడారు. టీడీపీ కార్యకర్తలకు అండగా ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి నారా లోకేశ్ పాదయాత్ర కొనసాగిందని చెప్పారు. ఆత్మకూరులో సీఎం చంద్రబాబు రెండుసార్లు పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. సోమశిల డ్యాం మరమ్మతులకు రూ.175 కోట్లు కేటాయించిన ఘనత చంద్రబాబుదేనని గుర్తు చేశారు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి . డ్యాం మెయింటెనెన్స్‌కి గ్రీసు కూడా ఇవ్వని స్థితిలో గత వైసీపీ పాలన సాగిందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ధ్వజమెత్తారు. ఆత్మకూరులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని వందపడకల నుంచి 150 పడకలకు పెంచామని చెప్పుకొచ్చారు. సోమశిలలో 30 పడకల ఆస్పత్రిని సీఎం చంద్రబాబు మంజూరు చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు పాలనలో సూపర్ సిక్స్ పథకాలు అమలు కాబోతున్నాయని స్పష్టం చేశారు. గతంలో పదివేల సభ్యత్వాలు కూడా లేని పరిస్థితుల నుంచి ఈరోజు లక్ష 50 వేల సభ్యత్వాలు చేసి రాష్ట్రంలో మూడో స్థానంలో నెల్లూరు జిల్లా నిలిచిందని అన్నారు. శాశ్వత సభ్యత్వాల్లో రాష్ట్రంలో రెండోస్థానంలో ఆత్మకూరు నియోజకవర్గం నిలిచిందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. టీడీపీ కోసం ప్రాణాలిచ్చే కార్యకర్తలే పార్టీకి బలమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అనుభవం ఉన్న నేత అని కొనియాడారు. ఆత్మకూరులో రూ.450 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. సోమశిల ప్రాజెక్ట్, రోడ్లు, కాలువలు వంటి చాలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆత్మకూరుకు మరిన్ని నిధులు తీసుకు రావడానికి తనవంతుగా కృషి చేస్తానని... అభివృద్ధి ఇలాగే కొనసాగాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు.

# గ్రామాలు అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలి : పవన్ కల్యాణ్


**అమరావతి, (రాజధాని వార్తలు):** గ్రామాలు అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆకాక్షించారు. మాటమంతి, భాగస్వామ్య గ్రామీణాభివృద్ధిలో ఒక నూతన యుగమని తెలిపారు. సాంకేతికత ప్రపంచాన్ని ఒక ప్రపంచ గ్రామంగా ఏకం చేసిందని, ఇక్కడ క్షణాల్లో మైళ్ల దూరం చేరుకోవచ్చని అన్నారు. గ్రామాల అభివృద్ధిలో పౌరులను ప్రత్యక్షంగా పాల్గొనేలా చేయడం, వారి సమస్యలను ప్రత్యక్షంగా అర్థం చేసుకునేలా ఏపీ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మాటమంతి అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందని గుర్తుచేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ఓ ట్వీట్ చేశారు. ఈ చొరవలో భాగంగా, ఈరోజు(మే22) తెల్లవారుజామున, శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గంలోని రావివలస గ్రామ నివాసితులను టెక్కలిలోని స్థానిక థియేటర్‌కు తీసుకువచ్చారని పవన్ కల్యాణ్ చెప్పారు. తన క్యాంప్ ఆఫీస్ నుంచి ప్రత్యక్ష వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, వారి ఆందోళనలు, సూచనలు, అభివృద్ధి అవసరాలను వినడానికి వారితో వ్యక్తిగతంగా సంభాషించే అవకాశం తనకు లభించిందని అన్నారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను హాజరైన అధికారులతో సమన్వయంతో పరిష్కరించారని చెప్పుకొచ్చారు. ఎక్కువ సమయం అవసరమయ్యే విషయాల కోసం, సమయపాలనతో సంబంధిత విభాగాలను చేపట్టాలని అభ్యర్థించారు. రావివలస ప్రజలు తమ




ఆందోళనలు, ఆశలను వ్యక్తపరచడానికి ముందుకు వచ్చిన ఉత్సాహం తనను చాలా కదిలించిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వారు కేవలం మాట్లాడలేదు, వారి గ్రామ భవిష్యత్తును తమ చేతుల్లోకి తీసుకున్నారు, ఇది నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని చెప్పుకొచ్చారు. ఈ చొరవ కేవలం ఒక కార్యక్రమం కాదని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఊహించిన గ్రామీణ భారత్ మహోత్సవ్ 2025 దార్శనికతను సాకారం చేయడంలో ఇది ఒక ముందడుగు అని ఉద్ఘాటించారు. మంత్రి అచ్చెన్నాయుడు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు రావివలస గ్రామ ప్రజలకు మద్దతుగా నిలిచారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు

# వక్ఫ్ బిల్లు సవరణ చట్టంపై తీర్పు రిజర్వ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన న్యాయమూర్తి

**న్యూఢిల్లీ :** వక్ఫ్ బిల్లు సవరణ చట్టం-2025 రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో గురువారం ఆసక్తికర చర్చ జరిగింది. ఈ పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టును రిజర్వ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టంలో మూడు ముఖ్యమైన అంశాలపై అభ్యంతరాలు వచ్చాయి. ముఖ్యంగా కోర్టులు వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను తిరిగి డీనోటిఫై చేసే అధికారంపై వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ వాదనలు ఆసక్తికరంగా సాగాయి. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, రాజీవ్ ధావన్, అభిషేక్ మను సింఘ్వి వాదించారు. ఈ చర్చల సమయంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ.. వక్ఫ్ అనేది దేవునికి అంకితమని, మరణానంతర జీవితం కోసంచేసే దానం అని అన్నారు. ఇతర మతాల మాదిరిగా కాకుండా, వక్ఫ్ అనేది దేవునికి చేసే దాతృత్వం అని అభివర్ణించారు. కపిల్ సిబల్



వాదనపై ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ స్పందించారు. మతపరమైన దానం అనే భావన ఇస్లాంకు మాత్రమే పరిమితం కాదని అన్నారు. హిందూ మతంలో కూడా మోక్షం పేరుతో దానాలను ప్రోత్సహిస్తారని గుర్తు చేశారు. అలాగే దాతృత్వం అనేది అన్ని మతాల ప్రాథమిక భావన అని స్పష్టం చేశారు. కాగా, వివాదాస్పద వక్ఫ్ బిల్లు సవరణ చట్టాన్ని తాత్కాలికంగా నిలిపి వేయాలన్న విజ్ఞప్తిపై ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తన ఉత్తర్వులను రిజర్వ్ చేసింది.

# ప్రభాకర్ రావుకు ఇంటికి పోలీసులు.. ఎందుకంటే




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఇంటికి సిట్ టీమ్ చేరుకుని నోటీసులు అంటించారు. ప్రభాకర్ రావును ప్రొక్లయిమ్డ్ అఫెండర్‌గా ప్రకటించాలని నాంపల్లి కోర్టును పోలీసులు కోరారు. దీనికి సంబంధించి జనవరిలో పోలీసులు పిటిషన్ వేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం రెండు రోజుల క్రితం కీలకమైన ఆదేశాలు ఇచ్చింది. ప్రభాకర్ రావు గడువులోపు న్యాయస్థానం ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. కోర్ట్ ఇచ్చిన గడువులోపు హాజరుకాకుంటే ప్రకటిత నేరస్తుడిగా ప్రకటిస్తామని కోర్టు తెలియజేసింది. ప్రభాకర్‌రావు ప్రకటిత నేరస్తుడిగా ప్రకటిస్తే ఆయన స్థిర, చర ఆస్తులను జప్తు చేసే అవకాశం ఉంది. జూన్ 20 లోపు వ్యక్తిగతంగా న్యాయస్థానం ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈరోజు (గురువారం) తారామతిలోని ప్రభాకర్ రావు ఇంటికి పోలీసులు చేరుకున్నారు. అయితే ఇంట్లో ఎవరూ లేకపోవడంతో వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ ఇంటికి పోలీసులు నోటీసులు అంటించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నారు. అందులో భాగంగా పోలీసుల విచారణలో కీలకమైన అంశాలు వెలుగు చూశాయి. ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు అయిన తర్వాత ప్రభాకర్ రావు అమెరికాలో తలదాచుకున్నాడు. దీంతో సీబీఐకి తెలంగాణ సీఐడీ లేఖ రాసింది. దీనిపై స్పందించిన సీబీఐ.. ఇంటర్‌పోల్ సాయంతో రెడ్ కార్నర్ నోటీసును జారీ చేసింది. అయినప్పటికీ ప్రభాకర్ రావు అమెరికా నుంచి ఇండియాకు రాలేదు. దీంతో ఆయన పాస్‌పోర్టును కూడా సస్పెండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు ప్రభాకర్ రావు విచారణకు రాకుండా దుమ్మాకొడుతూ వచ్చారు. మరోవైపు నాంపల్లి కోర్టు గతంలో ప్రభాకర్ రావుకు నాన్ బెయిలబుల్ వారెంట్ ఇచ్చింది. దాన్ని తెలంగాణ హైకోర్టులో ప్రభాకర్ రావు సవాల్ చేయగా... అక్కడ కూడా అతడికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. కొద్దిరోజుల క్రితమే ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ తెలంగాణ హైకోర్టులో ప్రభాకర్ రావు పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ హైకోర్టు కూడా ప్రభాకర్ రావుకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు దారులన్నీ మూసుకు పోయాయని చెప్పుకోవచ్చు. దీంతో కచ్చితంగా పోలీసుల విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంది. ఒకవేళ కోర్టు ఇచ్చిన గడువులోపు విచారణకు ప్రభాకర్ రావు హాజరు కాకపోతే తదుపరి చర్యలు తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# ఆంధ్రప్రదేశ్‌లో వైద్య ఆరోగ్య శాఖ అలర్ట్

**విజయవాడ, (రాజధాని వార్తలు):** కరోనా మార్గదర్శకాలను ఇవాళ (మే22)న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసింది. కరోనా నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. ప్రార్ధన సమావేశాలు, సామాజిక సమావేశాలు పార్టీలు, ఇతర కార్యక్రమాల వంటివి వాయిదా వేసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ కోరింది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు విమానాశ్రయాలు వంటి వాటిలో కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించింది. ఎక్కువ జనాభా ఉన్న ప్రదేశాల్లో మాస్కులు తప్పని సరిగా వాడాలని తెలిపింది. జ్వరం లేదా చలి, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారడం లేదా ముక్కుదిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించింది. అన్ని పరీక్ష సౌకర్యాలతో కూడిన 24 గంటలు పని చేసే ల్యాబ్‌లలో మాస్కులు, పీపీఈ కిట్ ట్రిబుల్ లేయర్ మాస్కులను తగిన పరిణామంలో ఉంచుకోవాలని అధికారులకు ఏపీ వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసింది.



# మా ఊర్లో రోడ్డు వేయరూ...

## - ఓఎన్జిసి భారీ వాహనాలు ధ్వంసం చేసిన ఓడలరేవు రహదారి - చినుకు పడితే రహదారిపై వరదే.. చెరువును తలపిస్తున్న రహదారి - వేల కోట్లు సంపద తరలించకుపోతూ గ్రామంలో రహదారులను ఛిద్రం చేస్తున్న ఓఎన్జిసి - గోతులలో పడి పలువురు ప్రయాణికులకు గాయాలు






**అల్లవరం, (రాజధాని వార్తలు):** ఒకటి కాదు రెండు కాదు వేలకోట్ల రూపాయల చమురు సహజ వాయు నిక్షేపాలను 30 ఏళ్లు తరబడి తరలించుకుపోతున్న ఓఎన్జిసి గ్రామంలో రోడ్లను ఛిద్రం చేస్తోంది. దేశంలోని రెండవ అతిపెద్ద గ్యాస్ టెర్మినల్‌గా ఉత్పత్తి సామర్థ్యం కలిగిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులోని ఓఎన్జిసి గ్రామంలో రహదారిపై వెళ్లలేని విధంగా ధ్వంసం చేసింది. చినుకు పడితే చాలు వరదలను తలపించేలా రహదారి జలమయంగా మారి చెరువులను తలపిస్తోంది. పంచనది వంతెన వద్ద నుండి ఓఎన్జిసి టెర్మినల్ వరకు అతిభారీ వాహనాల రాకపోకల కారణంగా మూడు అడుగులలోతు గోతులతో రహదారి అధ్వానంగా మారింది. వాహనదారులు ఆదమరిస్తే గోతులలో పడి తీవ్ర గాయాలు పాలు కావాల్సి వస్తోంది. సుమారు 10 వేల కోట్ల పైబడి పెట్టుబడితో ఓఎన్జిసి భారీ గ్యాస్ టెర్మినల్ నిర్మాణం చేపట్టినప్పటికీ కేవలం కిలోమీటర్ రహదారి నిర్మాణంలో తీవ్ర అలసత్వం వహిస్తోంది.

అదే గోతులలో ప్రతీ రోజు రాకపోకలు సాగిస్తున్న ఓఎన్జిసి అధికారులకు మాత్రం తహదారి దయనీయ దుస్థితి మాత్రం కంటికి కనిపించక పోవడం శోచనీయం. గ్రామస్తులు ఓఎన్జిసి వాహనాలను అడ్డుకొని మీ కారణంగానే గోతుల మయంగా మారిన రహదారిలో వెళ్లవలసి వస్తోందని రహదారి నిర్మించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన వద్ద నుండి టెర్మినల్ వరకు సిసి రహదారి మంజూరైనప్పటికీ రైతు భూములకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో రహదారి నిర్మాణం నిలిచి పోయింది. అయితే చెరువులను తలపించేలా మారిన రహదారికి కనీస మరమ్మత్తులు కూడా చేపట్టకుండా వదిలివేయడంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రభుత్వం గుంతలు పడిన రహదారులకు మరమ్మత్తులు చేపడుతునప్పటికీ ఓడలరేవు రహదారిని మాత్రం విస్మరించటంతో ప్రజలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఓఎన్జిసి స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# పొత్తులో పోరు మొదలు ..

## - పార్టీని నెగ్గించుకున్నాం ఇబ్బందులు పడుతున్నాం : మాజీ ఎంఎల్ఏ పిల్లి అనంతలక్ష్మి

**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):**పక్కా ప్రణాళికతో టీడీపీ, జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకొని ఎన్నికలలో ఘనవిజయం సాధించిన తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకుల మధ్య పోరు మొదలైంది. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ కు సముచిత స్థానంలో ఉంచి పరిపాలన కొనసాగిస్తున్న తరుణంలో లోకల్ నాయకుల మధ్య నాయకత్వ పోరు మొదలైంది. జనసేన ను మేమే నెగ్గించుకున్నాం కాని మాకు ప్రాధాన్యత లేదని కొందరు నాకు నాయకులు బాహటంగానే చెప్తున్నారు. దానికి ఉదాహరణ బుధవారం జరిగిన నియోజకవర్గ మహానాడు కార్యక్రమం. కాకినాడ రూరల్ స్పందన హాల్లో తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మరియు తెలుగు దేశం పార్టీ కో-కో ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూరల్ నియోజకవర్గ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ మహానాడు సభలో కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్.ఎల్.సి. పేరాబత్తుల రాజశేఖర్, రాష్ట్ర శెట్టిబలజి కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, నాయకులు







వాసిరెడ్డి ఏసుదాసు మరియు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కాకినాడ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి మాట్లాడుతూ జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్‌కు ఇవ్వనంత మెజారిటీ కాకినాడ రూరల్ నియోజకవర్గం ప్రజలు జనసేన పార్టీ ఎమ్మెల్యేకి ఇచ్చారని కానీ ఇప్పుడు తెలుగుదేశం పార్టీ నాయకులు కొన్ని ఇబ్బందులు పడుతున్నారని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఏ పిల్లి అనంతలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం కాకినాడ రూరల్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ త్వరగా నియమించాలని తెలుగుదేశం కార్యకర్తలు అయోమయంలో ఉన్నారని జనసేన పార్టీకే అన్ని పదవులు ఇస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులకు ఎటువంటి పదవులు రావడం లేదు.ఇవ్వడం లేదనీ ఇక్కడ నాయకత్వలోపం ఉంది అన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నిధులు ద్వారా ఎన్నో అభివృద్ధి కార్యక్రమలు చేస్తారు అలాగే తెలుగుదేశం పార్టీ తరుపున కొంత నిధులు ఇచ్చి కార్యక్రమలు చేసేలా చెయ్యాలని స్థానికంగా ఉన్నా పరిశ్రమలో.. కాకినాడ రూరల్ ఉన్నో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి వారు మాట్లాడారు. అలాగే కాకినాడ రూరల్ ఇంచార్జ్ ఏర్పాటు చెయ్యమని కార్యకర్తలు ఎన్నో సార్లు అడుగుతున్నారని నియమించకపోవడం పార్టీ తప్పిదం పార్టీకి కర్త కర్మ క్రియ కార్యకర్తలే అలాంటి కార్యకర్తలు చిన్నచూపు చూడవద్దు అని నాయకులు కార్యకర్తకు భరోసా ఇవ్వడం వలన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు కూడ ఇంత బలంగా ఉంది అని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి ఎన్నో సంక్షోభాలు వచ్చిన చెక్కు చెదరకుండా ఉంది ఉంటే అది కార్యకర్తల బలమేనని కోటి 3 లక్షల సభ్యత్వం కలిగిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని కాకినాడ రూరల్ తెలుగుదేశం ఇంచార్జిని త్వరగా నియమించాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుని కోరతామని అనంతలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ నియోజక వర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్నంలోని ఐఎంఎల్ బేవరీస్ డిపో వద్ద ఉన్న శ్రీ సత్తెమ్మ అమ్మవారి ఆలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయులు నిమ్మకాయల రంగనాగ్ బుధవారం చేపట్టారు. ఐఎంఎల్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయులు రంగనాగ్ సామర్లకోట పెద్దాపురం తెలుగుదేశం పార్టీ నాయకులు విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించనున్న అమ్మవారు ఆలయానికి రంగనాగ్ కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందించనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. కాగా ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకువచ్చి తమ వంతు సహకారాన్ని అందించాలని కార్మికుల కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, సామర్లకోట పట్టణ తెదేపా అధ్యక్షులు అడబాల కుమారస్వామి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు వాసు, భీమేశ్వరాయల ధర్మ కర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, ఐఎంఎల్ డిపో మేనేజర్ కాటూరి రామకృష్ణ, ఎయం సిహెచ్ రమణబాబు, ఎస్ ఓ కన్నూరి త్రిమూర్తులు, ఎక్సైజ్ సీఐ కే శ్రీనివాసు, సంఘ అధ్యక్షులు విశ్వనాధుల అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి అమలకంటి సోమేశ్, నాయకులు విప్పర్తి కొండలరావు, బైరెత్తి సత్యనారాయణ, కూంద్రపు దుర్గాప్రసాద్, ఉండవల్లి సతీష్, బిక్కిన శ్రీనివాస్, సిరికి శ్రీను, పప్పల సత్తిబాబు, మిడతాడ శ్రీను, నందిపాటి వీరబాబు, వెన్నెల గోవిందు, నక్కా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 27న జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి : మంత్రి సుభాష్



**రామచంద్రపురం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో వారంవారం నిర్వహించే జాబ్ మేళాలో భాగంగా వైజాగ్ కు చెందిన కాంసెంట్రిక్స్, డబ్ల్యూ ఎన్ ఎస్ కంపెనీలలో ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 నుండి 27 సంవత్సరాల అభ్యర్థులకు నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకో వాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ప్రాసెస్ అసోసియేట్ ఉద్యోగాల కొసం సుమారు రూ 16 వేలు జీతంతో ఈ నెల 27 న ఉదయం 9.30 గంటల నుంచి రామచంద్రపురం కేవీర్ హాస్పిటల్ వెనుకగల ఉపాధి ఆఫీస్ నందు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ సత్యం మరియు ఉపాధి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాంకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రామచంద్రపురం నియోజవర్గంలో నిరుద్యోగాన్ని నిర్మూలించేందుకు రాష్ట్రంలోని పలు కంపెనీలతో ఒప్పందం చేసుకుని ప్రతివారం ఈ జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తున్నా మన్నారు. మరిన్ని వివరములు కోసం 9515481671 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# ఘనంగా అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట...పూజల్లో డిసిసిబి చైర్మన్ బాబు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణం మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న శ్రీ దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) విచ్చేసి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, వేద పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ అభయ ఆంజనేయ స్వామి విగ్రహంపై చేతులుంచగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ ప్రతిష్ట కార్యక్రమం అనంతరం ఆలయం వద్ద భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించగా వేలాది మంది ప్రజలు, భక్తులు పాల్గొని స్వామివారు ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ ప్రతిష్ట పూజల్లో ఆలయ కమిటీ



నాయకులు అర్చకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పెద్దాపురం కమిషనర్‌గా శ్రీకాంత్ రెడ్డి బాధ్యతలు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మున్సిపల్ కమిషనర్‌గా కె శ్రీకాంత్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కమిషనర్‌గా పనిచేసిన పద్మావతి బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో ఇప్పటివరకు కాకినాడ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పనిచేస్తున్న శ్రీకాంత్ రెడ్డి పెద్దాపురం మున్సిపల్ కమిషనర్‌గా నియమితుల య్యారు. దానితో బుధవారం ఉదయం ఆయన మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కార్యాలయానికి విచ్చేసిన నూతన కమిషనర్ శ్రీకాంత్ రెడ్డికి కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలిచారు. అనంతరం కమిషనర్ సిబ్బందితో సమావేశమై స్థానిక ప్రజా సమస్యలు, సిబ్బంది విధి విధానాలు, పట్టణ ప్రాధాన్యతపై అడిగి తెలుసుకున్నారు. పెద్దాపురం పట్టణ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సిబ్బంది పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు.



త్రాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, పన్నుల వసూలు తదితర విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడుపనున్నట్టు ఈ సందర్భంగా కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి చెప్పారు.

# నయన్ అప్పుడే మరో అవకాశం..?



కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార ఈమధ్య కాస్త ఫాం కోల్పోయినట్టు అనిపించినా మళ్లీ తిరిగి వరుస ఛాన్స్ లు అందుకుంటుంది. తమిళ్ లోనే కాదు తెలుగులో కూడా నయన్ తిరిగి అవకాశాలు అందుకుంటుంది. మెగాస్టార్ చిరంజీవి అనిల్ రావిపూడి కాంబినేషన్ సినిమాలో నయనతార హీరోయిన్ గా లాక్ అయ్యింది. ఆ సినిమా ఓకే అవ్వడమే ఆలస్యం నయనతారకి తెలుగులో మళ్లీ వరుస ఛాన్స్ లు వస్తున్నట్టు తెలుస్తుంది. మెగా 157 ఆఫర్ అందుకున్న అమ్మడు ఆ సినిమాలో ఆన్ బోర్డు అని అనౌన్స్ చేయడమే ఆలస్యం మరో ఆఫర్ కూడా అమ్మడికి వచ్చినట్టు తెలుస్తుంది. ఒక క్రేజీ స్టార్ హీరో సినిమాలో నయనతార ని హీరోయిన్ గా తీసుకోవాలని అనుకుంటున్నట్టు తెలుస్తుంది. నయనతార కూడా ఆ మేకర్స్కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తుంది. ఐతే ఆ ప్రాజెక్ట్ ఏంటి దాని వివరాలు మాత్రం బయటకు రాలేదు. తమిళ్లో స్టార్గా కొనసాగుతున్న టైం లో కూడా తెలుగు ఆఫర్లను కాదనకుండా చేస్తూ వచ్చింది నయనతార. మన స్టార్స్ అయిన ప్రభాస్, ఎన్ టీ ఆర్లతో కలిసి పనిచేసిన నయనతార సీనియర్ స్టార్స్ చిరంజీవి బాలకృష్ణ వెంకటేష్ నాగార్జునలతో కలిసి నటించింది. ఐతే కొన్నాళ్లుగా తెలుగు సినిమాలకు దూరంగా ఉన్న ఈ అమ్మడు మళ్లీ చిరు సినిమాతో రీ ఎంట్రీ ఇస్తుంది. ఐతే చిరు సినిమా ఇలా సైన్ చేసిందో లేదో మరో అవకాశం కూడా అమ్మడి తలుపు తట్టిందని తెలుస్తుంది. నయనతార మెగా సినిమాతో పాటు చేయనున్న ఆ నెక్స్ట్ సినిమా ఏది ఆ ఛాన్స్ ఎవరు అందుకుంటున్నారు అన్నది తెలియాలి ఉంది. ఐతే ఓ పక్క కోలీవుడ్లో కూడా తన ఫాం ఏమాత్రం తగ్గకుండా కొనసాగిస్తుంది నయనతార. లేడీ సూపర్ స్టార్ ట్యాగ్ లైన్ కి న్యాయం చేస్తూ నయన్ చేస్తున్న సినిమాలు వాటి ఫలితాలు ఆమె ఫ్యాన్స్ని సూపర్ సాటిస్ఫై చేస్తున్నాయి. మరి నయన్ దూకుడు చూస్తుంటే మళ్లీ తెలుగు తమిళ్లో అదరగొట్టేందుకు సిద్ధమవుతుందనిపిస్తుంది. నయన్ తమిళ్ లో కూడా రెండు సినిమాలు చేస్తుంది. వాటితో కూడా మరోసారి తన స్టామినా చూపించాలని ఫిక్స్ అయ్యింది. ఐతే నయన్ తెలుగు రీ ఎంట్రీ ఆమె ఫ్యాన్స్కి సూపర్ జోష్ అందిస్తుంది.

# అప్పుడు రాజమౌళి.. ఇప్పుడు వంగా!



తెర వెనకజరిగే చర్చలు, ఘటనలు ఒక్కోసారి కథలకన్నా ఎక్కువ ఆసక్తికరంగా హాట్ టాపిక్ గా మారతాయి. స్టార్ దర్శకులు, స్టార్ నటీనటుల మధ్య ఎంతో సహకార భావంతో పనులు జరిగిపోతాయనుకునే వాళ్లకూ, ఒప్పందాల వెనక ఉండే బిజినెస్ డిమాండ్లు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. గతంలో దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి ఇదే అనుభవాన్ని బాహుబలి సినిమా విషయంలో ఎదుర్కొన్నారు. మొదట శివగామిగా శ్రీదేవిని భావించిన రాజమౌళి, ఆమె అన్రీసనబుల్ డిమాండ్ల వల్ల చివరకు రమ్యకృష్ణనే ఎంచుకున్నారు. ఇదే తరహాలో ఇప్పుడు మరో స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కూడా 'స్పిరిట్' సినిమా కోసం దీపికా పదుకునేను తప్పించినట్టు కథనాలు వస్తున్నాయి. బాహుబలి సమయంలో శ్రీదేవి రెమ్యూనరేషన్, బిజినెస్ క్లాస్ టికెట్లు, లగ్జరీ హోటల్స్, లాభాల్లో వాటా వంటి వాటిని డిమాండ్ చేసినట్లు రాజమౌళి ఓపెన్ హార్ట్ విత్ ఆర్కె ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చారు. ఆ తర్వాత శ్రీదేవి కూడా స్పందించి అలా ఏమీ అడగలేదు అని ఏదైనా మిస్ కమ్యూనికేషన్ అయ్యి ఉండవచ్చు అని చెప్పింది అప్పట్లో అది రెండు వైపులా నెగిటివ్ కామెంట్స్కు దారి తీసింది. ఇక లేటెస్ట్గా అదే ఇప్పుడు వంగా ఎదుర్కొన్న పరిస్థితి కావొచ్చు. ఇన్సైడ్ టాక్ ప్రకారం, దీపికా పదుకునే స్పిరిట్ చిత్ర బృందానికి రోజుకు ఆరు గంటలకు మించి పనిచేయలేనని, 100 రోజుల్లో తన పార్ట్ పూర్తవ్వాలని, అతిగా వేతనం ఇవ్వాలంటూ డిమాండ్లు పెట్టినట్లు తెలుస్తోంది. అంతేకాదు, ఆమె వ్యక్తిగత సిబ్బందికి ముంబై నుంచి ప్రయాణ ఖర్చులు, వసతి వంటి అంశాలను కూడా ప్రస్తావించిందట. అయితే ఇలాంటి డిమాండ్లను సమర్థించలేనన్న భావనతో వంగా బృందం ఆమెను చిత్రబృందం నుంచి తప్పించినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటివరకు అధికారికంగా ఎవరూ స్పందించకపోయినా, ఇండస్ట్రీలో అయితే వంగా తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించే స్వరం ఎక్కువగా వినిపిస్తోంది. దీపికా పదుకునేని తప్పించిన నేపథ్యంలో సందీప్ వంగా మరో ఫ్రెష్ ఫేస్ లేదా తెలుగు భాషతో అనుబంధం ఉన్న నటిని ఎంపిక చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక్కడ అసలైన ఆసక్తికర విషయం ఏమిటంటే.. రాజమౌళి స్పందించిన విధానం ఒకప్పుడు వివాదంగా మారింది. కానీ ఇప్పుడు అదే పనిని వంగా చేస్తున్నా విమర్శలు పెద్దగా రావడం లేదు. దీని వెనక ఒకటే కారణం. ఇప్పటి దర్శకులు తమ బిజినెస్ లిమిటేషన్లు బేస్ చేసుకొని హీరోయిన్స్ ఎంపికపై స్పష్టతను చూపుతున్నారు. అలాగే దీపికా గత ఏడాది కొన్ని కమర్షియల్ సినిమాల్లో అప్ టు మార్క్ ఫలితాలు రాకపోవడం కూడా మేకర్స్ జాగ్రత్తలు తీసుకునేలా చేసిందని అంటున్నారు. ఇక సందీప్ వంగా స్పిరిట్ కోసం మరో స్టార్ నటిని ఎంపిక చేయడంలో బిజీగా ఉన్నాడట. మొత్తానికి అప్పట్లో రాజమౌళి తీసుకున్న నిర్ణయం.. ఇప్పుడు అదే దిశలో వంగా తీసుకున్న నిర్ణయం హాట్ టాపిక్స్ గా మారాయి. హై లెవెల్ డిమాండ్ లో ఉన్న స్టార్స్ కు కూడా రిజెక్షన్స్ తప్పవని చెప్పవచ్చు. ఇక వంగా ఈ తరహా విషయంపై భవిష్యత్తులో స్పందిస్తారో లేదో చూడాలి.

# అసలైన ఘట్టంలో పెద్ది.. చరణ్ లుక్స్ వైరల్!



మెగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్లో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా మూవీ 'పెద్ది'కి ఎనౌన్స్ చేసినప్పుడే భారీ స్థాయిలో అంచనాలు ఏర్పడ్డాయి. రామ్ చరణ్, జాన్వీ కపూర్, దివ్యేందు శర్మ, శివరాజ్ కుమార్, జగపతిబాబు లాంటి కీలక తారాగణం ఉండటంతో ఈ సినిమా ఓ స్పెషల్ క్రేజును సొంతం చేసుకుంది. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వస్తోన్న ఈ మూవీని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. లేటెస్ట్గా హైదరాబాద్ శివార్లలో వేసిన భారీ విలేజ్ సెట్లో కీలక షెడ్యూల్ను ప్రారంభించారు. ఇప్పటికే ఫస్ట్ గ్లింప్స్తో పాన్ ఇండియా రేంజ్ కు తగ్గట్టుగా సినిమాకు క్రేజ్ ఏర్పడింది. ఇక ఇప్పుడు సినిమా షూటింగ్ స్పీడ్ పెరిగింది. లేటెస్ట్గా ఒక కీలక ఘట్టంలోకి పెద్ది ఎంట్రీ ఇస్తున్నాడు. సినిమాలో ఓ భారీ యాక్షన్ బ్లాక్, టాకీ పార్ట్ను లేటెస్ట్ షెడ్యూల్లో చిత్రీకరించనున్నారు. సెట్ డిజైన్ విషయంలో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బుచిబాబు టీమ్, అత్యంత డిటెయిల్డ్గా గ్రామీణ వాతావరణాన్ని తీర్చిదిద్దింది. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఫ్యాన్స్ను ఫిదా చేస్తున్నాయి. స్ట్రాంగ్గా కనిపిస్తున్న చరణ్ లుక్ లాంగ్ హెయిర్, గడ్డం లుక్ వైరల్గా మారింది. యాక్షన్ ఎమోషన్స్తో కూడిన ఈ సినిమాలో చరణ్ పాత్రలో చాలా డెప్త్ ఉంటుందని సమాచారం. 'ఉప్పెన' తర్వాత దర్శకుడు బుచ్చిబాబు సానా చేస్తున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, సినిమాటోగ్రాఫీని రత్నవేలు అందిస్తున్నారు. అలాగే నేషనల్ అవార్డ్ విజేత నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు చూసుకుంటున్నారు. మరోవైపు ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా సెట్లకు ప్రత్యేక కేరెక్టర్ తీసుకొచ్చారు. రామ్ చరణ్ ఓ రఫ్ అండ్ రస్టిక్ పాత్రలో కనిపించబోతున్న ఈ సినిమా 2026 మార్చి 27న గ్రాండ్గా విడుదల కానుంది. ఇదే రోజు చరణ్ పుట్టినరోజు కావడం విశేషం. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరగుతోందని సమాచారం. ప్రమోషనల్ కంటెంట్కు ఇప్పటికే మంచి స్పందన రావడంతో ఆ అంచనాలను నిలబెట్టేలా భారీ స్థాయిలో సినిమా తెరకెక్కుతోంది. 'పెద్ది' సినిమాలో కంటెంట్తో పాటు కమర్షియల్ హంగులూ బాగా మిక్స్ చేస్తున్నారని, బుచ్చిబాబు సానా ఈ సినిమా ద్వారా తన స్థాయిని మరింత పెంచనున్నాడని టాక్. భారీ బడ్జెట్ పక్కా కాస్టింగ్ విభిన్న కథాంశంతో తెరకెక్కుతున్న 'పెద్ది' మరోసారి చరణ్ స్టార్ డమ్ను రుజువు చేసే సినిమాగా మారుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

# పవన్- బాలయ్య మధ్య క్లాష్?







టాలీవుడ్లో భారీ బడ్జెట్తో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న సినిమాలకు రిలీజ్ డేట్ల సమస్య బాగా ఎక్కువైపోయింది. ఎంతో ముందుగానే డేట్స్ లాక్ చేసుకుంటే తప్పించి సోలో రిలీజులు దక్కడం లేదు. పోనీలే పోటీకి వెళ్దామంటే భారీ బడ్జెట్తో తెరకెక్కిన సినిమాలు పోటీతో రిలీజైతే కలెక్షన్లు షేరవుతాయి. క్రమంగా కలెక్షన్ల మీద ఆ ఎఫెక్ట్ పడుతుంది. అందుకే పెద్ద సినిమాల దర్శక నిర్మాతలంతా సోలో రిలీజ్ డేట్ కోసం చూస్తూ ఉంటారు. దాని కోసం ఎంతో ముందుగానే డేట్ను లాక్ చేసుకుని ఆ డేట్ పై కర్చీఫ్ వేసుకుని ఉంచుకుంటున్నారు. రిలీజ్ డేట్స్ అయితే అనౌన్స్ చేస్తున్నారు కానీ చెప్పిన డేట్కు సినిమాలను రిలీజ్ చేయలేకపోతున్నారు. దానికి కారణం నటీనటుల కాల్షీట్స్, షూటింగ్ లేటవడం, వీఎఫ్ఎక్స్, పోస్ట్ ప్రొడక్షన్ ఇలా ఏవైనా అవొచ్చు. దీనివల్ల రిలీజ్ డేట్స్ వాయిదా పడటంతో పాటూ ఏ క్లాష్ అయితే వద్దనుకుంటున్నారో ఆ క్లాషే ఎదురయ్యే పరిస్థితులొస్తున్నాయి. ఇక అసలు విషయానికొస్తే పవన్ కళ్యాణ్, బాలకృష్ణ సినిమాలు బాక్సాఫీస్ వద్ద పోటీ పడే ఛాన్సున్నట్టు డిస్ట్రిబ్యూషన్ వర్గాల్లో నడుస్తున్న ప్రచారం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్గా మారింది. బాలయ్య, బోయపాటితో చేస్తున్న అఖండ2 సెప్టెంబర్ 25న రిలీజ్ కానున్నట్టు అనౌన్స్మెంట్ టైమ్లోనే చెప్పారు. మరోవైపు పవన్ కళ్యాణ్, సుజీత్ దర్శకత్వంలో చేస్తున్న ఓజీ సినిమాను సెప్టెంబర్ 26న రిలీజ్ చేస్తే ఎలా ఉంటుందని నిర్మాత డీవీవీ దానయ్య డిస్ట్రిబ్యూటర్లతో అన్నారట. అయితే ఓజీ సినిమాను ముందు సెప్టెంబర్ 5న రిలీజ్ చేద్దామనుకున్నారు కానీ ఆ టైమ్లో సెలవులు ఉండవు కాబట్టి సెప్టెంబర్ 26 పండగ సీజన్ను వాడుకోవాలని దానయ్య ప్లాన్ చేస్తున్నాడని అంటున్నారు. ఈ వార్తల్లో నిజమెంతన్నది పక్కనపెడితే ఇందులో సాధ్య అసాధ్యాలను చూస్తే ఈ రెండు సినిమాల మధ్య పోటీ దాదాపు ఉండదనే చెప్పాలి. దానికి కారణం పొలిటికల్గా బాలయ్య, పవన్ మధ్య ఎంతో మంచి సాన్నిహిత్యం ఉంది. దాన్ని కాదని ఇద్దరూ బాక్సాఫీస్ వద్ద పోటీ పడి కలెక్షన్లను షేర్ చేసుకుని నష్టపోవాలని అనుకోరు. ఒకవేళ నిర్మాతలకు ఈ దిశగా ఆలోచనలున్నా హీరోలిద్దరూ మాట్లాడుకుని దాన్ని పరిష్కరించే వీలుంది. కాబట్టి ఓజీ, అఖండ2 సినిమాల మధ్య క్లాష్ దాదాపుగా ఉండకపోవచ్చు.

# ప్రపంచ వ్యాప్తంగా తెలుగుజాతి ఖ్యాతిని చాటిన తెలుగుదేశం పార్టీ

## - టీడీపీ సభ్యునిగా ఉండటం గౌరవం - అన్న ఎన్టీఆర్ ఆశయాల సాధనకు విశేష కృషి - దార్శనికులు సీఎం చంద్రబాబు నాయకత్వంలోనే ఏపీ సమగ్రాభివృద్ధి, పేదల సంక్షేమం సాధ్యం - కోటికి పైగా సభ్యత్వాలతో రికార్డు సృష్టించిన టీడీపీ - మంత్రి లోకేష్ సారథ్యంలో కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట : మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు

**ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం, (రాజధాని వార్తలు):** ప్రపంచ వ్యాప్తంగా తెలుగుజాతి ఖ్యాతిని ఇనుమడింప చేసిన గొప్ప పార్టీ తెలుగుదేశం పార్టీ అని, తెలుగుదేశం పార్టీ సభ్యునిగా ఉండటం ఒక గౌరవం, మర్యాద అని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని రక్షించడం కోసం ఆనాడు అన్న ఎన్టీఆర్ గారు తెలుగుదేశం పార్టీని స్థాపించారని, ఆయన ఆశయాల సాధనకు తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని మైలవరం శాసనసభ్యులు, టీడీపీ ఇంఛార్జి వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని గుంటుపల్లిలో సీఏ కన్వెన్షన్‌లో జిల్లా మినీమహానాడును గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు నెట్టెం రఘురాం, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



(తాతయ్య), ఉమ్మడి కృష్ణాజిల్లా మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, టీడీపీ అధికార ప్రతినిధి రఫీ, తదితర టీడీపీ నేతలతో మైలవరం శాసనసభ్యులు, టీడీపీ నియోజకవర్గ ఇంఛార్జి వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జోహార్ ఎన్టీఆర్, జై తెలుగుదేశం, జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. అన్న ఎన్టీఆర్ ప్రతిమకు పూలమాలలు వేసి, పుష్పములు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులలో తన తండ్రి మాజీ హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు కూడా ఉండటం నా అదృష్టంగా భావిస్తున్నా నన్నారు. దార్శనికులు సీఎం చంద్రబాబు నాయకత్వంలోనే ఏపీ సమగ్రాభివృద్ధి, పేదల సంక్షేమం సాధ్యమన్నారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఆనాడు ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడే సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. 2019లో ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఏపిని అంధకారంలోకి నెట్టాడని అన్నారు. ఏపీని ఎలా అభివృద్ధి చేద్దామని సీఎం చంద్రబాబు ఆలోచిస్తే, ఏపీలో ఏ వనరులను ఎలా దోచుకోవాల అని జగన్మోహన్ రెడ్డి ఆలోచించాడన్నారు. మద్యం, ఇసుక మాఫియా ద్వారా వేల కోట్ల రూపాయలను పక్కదారి పట్టించారని అన్నారు.

జగన్మోహన్ రెడ్డి విధ్వంసకర పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. సీఎం చంద్రబాబు తన పరిపాలనా దక్షతతో ఏపీని గాడిలో పెడుతున్నారని అన్నారు. ఏపీ ఉజ్వల భవితకు 2029లో కూడా సీఎంగా చంద్రబాబుని అందరూ గెలిపించుకోవాలన్నారు. ఇందుకు మనమంతా ఆయ నతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. టీడీపీ జాతీయ కార్యదర్శి, మంత్రి లోకేష్ సారథ్యంలో కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట వేసిందన్నారు. కోటికి పైగా సభ్యత్వాలతో రికార్డు సృష్టించినట్లు వెల్లడించారు.

నారా లోకేష్‌కి ఎప్పుడు పార్టీ పగ్గాలు పూర్తిగా అప్పచెప్పాలో సీఎం చంద్రబాబుకి తెలుసని, ఇప్పుడు ప్రత్యేకంగా తీర్మానం అవసరం లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని ఎంపీపీలు, జడ్పిటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచిలు పూర్తిగా టీడీపీ విజయకేతనం ఎగుర వేసేందుకు మంతా ఐకమ త్యంగా పనిచేద్దామన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని మరింత బలపరుద్దామన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేలకు, ప్రజాప్రతినిధులకు, టీడీపీ నాయకులకు, కార్యకర్త లకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు స్థానిక శాసన సభ్యులు కృష్ణప్రసాదు ఘనంగా స్వాగతం పలికారు.

# త్రాగునీటి కోసం తిప్పలు...మోటర్ మోగనట్లే!

## - కొళాయిల వద్ద గంటల తరబడి మహిళల నిరీక్షణ



**అల్లూరి జిల్లా,చింతపల్లి, (రాజధాని వార్తలు):** చింతపల్లి మండల కేంద్రానికి సమీపంలోని అంతర్ల పాతవీధిలో తాగునీటి కొరత గ్రామస్థులను గట్టిగా పట్టుకుంది. గ్రామానికి నీరు సరఫరా చేసే మోటార్ ధ్వంసమవడంతో గత వారం రోజులుగా కొళాయిలన్నీ ఎండిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రజలు దూరప్రాంతాల్లోని పారుగడ్డల వరకు వెళ్లి బురద కలిసిన నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రత్యేకంగా మహిళలు ఈ నీటి తిప్పలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బకెట్లు, బిందెలు, బుట్టలతో కొళాయిల వద్ద గంటల తరబడి నీటి కోసం నిలబడటం, లేదా కిలోమీటర్ల దూరంలోని చింతపల్లి జాతీయ రహదారి దాటి నీటిని తీసుకురావడం బాధాకర దృశ్యాలను సృష్టిస్తోంది. అయితే, తాగు నీటి అవసరాలు తీరని పరిస్థితిలో ఉండగా, అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "ఇంటి పన్నులు, నీటి పన్నులు వసూలు చేయడంలో మాత్రం అధికారుల మొండితనం తగ్గదు. కానీ ప్రజల ఆరోగ్యానికి ప్రాథమికమైన తాగునీటి విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారు" అని గ్రామస్థులు విమర్శించారు. ఇప్పటికే బురదనీటి వాడకం వల్ల జలుబు, దగ్గు, జ్వరాల వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. తక్షణమే నీటి మోటర్ మరమ్మతులు చేసి, నీటి సరఫరా పునరుద్ధరించాలని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# అంతర్జాతీయ బయోడైవర్సిటీ దినోత్సవంలో గిరిజన వికాస్ సంస్థకు విశేష గుర్తింపు

## - ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా సత్యనారాయణకు ఘన సత్కారం




**అల్లూరి జిల్లా,చింతపల్లి, (రాజధాని వార్తలు):** విశిష్ట పర్యావరణ సేవలకు గుర్తింపుగా గిరిజన వికాస్ సంస్థకు ప్రతిష్ఠాత్మకమైన బయోడైవర్సిటీ రక్షక్ అవార్డు లభించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగిన అంతర్జాతీయ బయోడైవర్సిటీ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఈ అవార్డును సంస్థ వ్యవస్థాపకులు, కార్యదర్శి నెల్లూరి వెంకట సత్యనారాయణ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో ఘనంగా సత్కరించారు. గత రెండు దశాబ్దాలుగా చింతపల్లి, జి.కే. వీది, కొయ్యూరు మండలాల్లో గిరిజన వికాస్ సంస్థ పర్యావరణ పరిరక్షణ, సుస్థిర వ్యవసాయ విధానాల అభివృద్ధిలో విశేష కృషి చేస్తున్నది. నాబార్డ్ సహకారంతో గిరిజన రైతుల చేత పండ్ల తోటల అభివృద్ధికి దోహదపడిన ఈ సంస్థ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కాఫీ తోటలలో ఆర్గానిక్ సర్టిఫికేషన్ ప్రక్రియను చేపట్టి రైతులను ప్రోత్సహిస్తోంది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, "ఈ అవార్డు మా సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది, గిరిజన రైతులు, మాకు తోడ్పడిన సహకార వర్గాల అంకితభావం ఫలితమే. అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని అన్నారు. ఈ అవార్డు సంస్థకు మరింత బాధ్యతను కలిగించిందని, భవిష్యత్తులో మరిన్ని పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు.

# చిన్నబరడకు తాగునీటి కోసం ఆర్తనాదం

## - సమస్య పరిష్కారానికి జనసేన నేతల వినతి : జనసేన మండల అధ్యక్షుడు బుజ్జిబాబు


**అల్లూరి జిల్లా,చింతపల్లి, (రాజధాని వార్తలు):** చింతపల్లి స్వాతంత్ర్యం తరువాత కూడా త్రాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న చిన్నబరడ గ్రామానికి తక్షణమే తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎంపీడీవో శ్రీనివాసరావును కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి అందజేశారు. గ్రామంలో సుమారు 90 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ, శుద్ధత లేకుండా ఉండే బుక్కెడి నీరు మాత్రమే అందుబాటులో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. 2014లో నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో పెదబరడ, చిన్నబరడ గ్రామాలకు గ్రావిటీ ఆధారిత త్రాగునీటి పథకం ప్రారంభించినప్పటికీ, ప్రస్తుతానికి ఆ నీరు కేవలం పెదబరడ గ్రామానికే సరఫరా అవుతుండటంతో చిన్నబరడ గ్రామానికి సరఫరా నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో



శ్రీనివాసరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లిన బుజ్జిబాబు, తక్షణమే త్రాగునీటి సమస్య పరిష్కారం కావాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎంపీడీవో, సాధ్యమైనంత త్వరగా త్రాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి రాజుబాబు, గ్రామస్తులు ధర్మ, శివ, రామకృష్ణ, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# నాతవరంలో ఘనంగా హనుమాన్ జయంతి

**నాతవరం, (రాజధాని వార్తలు):** ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం విశేషా పూజలు, తమలపాకులతో అభిషేకాలు చేశారు. ఈ పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్త పైల పోతురాజు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.



# వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన





**మైలవరం, (రాజధాని వార్తలు):** మైలవరం శాఖా గ్రంధాలయం నందు విద్యార్థిని, విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయులు సురేష్ బాబు గణిత శాస్త్రంలో కొలమానం, ధైర్ఘ్యమానం అనే అంశాల గురించి సులభరీతిలో అర్థమయ్యేలా విశ్లేషించడమైనది. గణిత శాస్త్రంలో జ్యామితి బిందువులు, రేఖలు, కోణాలు, ఘనాలు, వాటి కొలతల గురించి వివరించడం జరిగింది. తదనంతరం జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# ఆంధ్ర కాశ్మీర్‌లో జాతర సందడి

## - లంబసింగి రాకాసమ్మ దేవి ఉత్సవాలకు భక్తుల పోటెత్తే అవకాశమన్న ఉత్సవ కమిటీ



**అల్లూరి జిల్లా,చింతపల్లి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌కు 'కాశ్మీర్'గా పేరొందిన లంబసింగిలో భక్తి శ్రద్ధలతో జాతర మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గ్రామ దేవత అయిన శ్రీశ్రీశ్రీ రాకాసమ్మ దేవి జాతరను జూన్ 1 నుంచి 3 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఏడాది జాతరలు గత సంవత్సరం కంటే మరింత ఘనంగా జరిగే అవకాశం ఉందని, భక్తులు మరియు పర్యాటకులు భారీగా తరలివచ్చే సూచనలు కనిపిస్తున్నాయని వారు పేర్కొన్నారు. భద్రతాపరంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. పర్యాటకుల రాకతో గ్రామంలో రద్దీ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, భక్తులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కమిటీ విజ్ఞప్తి చేసింది. శ్రీ రాకాసమ్మ దేవి ఆశీస్సులతో గ్రామానికి మరింత పేరు, ప్రతిష్టలు చేకూరాలని ఆకాంక్షిస్తూ జాతరను అందరూ కలసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan